క్లుప్తంగా

ఆయుష్మాన్ భారత్‌తో ఉచిత వైద్యసేవలు



అమరచింత: తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యసదుపాయాలు పొందవచ్చని సీఎస్సీ సెంటర్ నిర్వాహకులు పృథ్వీనాగలింగేశ్వర్ తెలిపారు. పట్టణంలోని రజక వీధిలో రజక కులస్తులకు ఆదివారం ప్రధాన మంత్రి అయుష్మాన్ భారత్ పథకం ద్వారా కార్డు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించారు. భారత ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న పథకానికి ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అన్ని చేతివృత్తుల వారితో పాటు తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ సత్యేందర్, డ్రైవర్ శ్రీనివాసులు, సవరన్న, శ్రీనివాసులు, చిన్న రాజ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

వనపర్తిటౌన్: ఎదిగిన యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చనిపోవడం బాధాకరమని మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని 3వ వార్డుకు చెందిన బాలకృష్ణ రోడ్డు ప్రమాదంలో గాయపడి చనిపోవడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఆదివారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్ ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని గుడి ప్రీమియర్ క్రికెట్ పోటీలను ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు మేకల యల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉగాది పండుగను పురస్కరించుకుని క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, యువకులు, క్రికెట్ ప్లేయర్స్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నిరంజన్



పాన్‌గల్: కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఎండీ నిరంజన్‌ను నియమించారు. నియామక పత్రాన్ని ఆదివారం రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సిరాజొద్దీన్ చేతుల మీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన కొల్లాపూర్ టౌన్ అధ్యక్షుడు బాలపీర్, పార్టీ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్షాద్, నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి తోడ్పాటుతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



వనపర్తి క్రైం: వనపర్తి నియోజకవర్గంలో స్థానిక మంత్రి ఒంటెద్దు పోకడలు, అవినీతి పాలన నచ్చక సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌కి రాజీనామాలు చేసినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ అన్నారు. ఆదివారం వనపర్తి మండలం అచ్యుతాపురంలో యువ నాయకుడు గాంధీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చెరువుల సుందరీకరణ, ట్యాంక్‌బండ్ పేరుతో టెండర్లకు తిలోదకాలిచ్చి రూ.కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి, కృష్ణ, అధికార ప్రతినిధి శ్రీశైలం, జింకల కృష్ణయ్య, ఆర్.వెంకటేశ్వర్ రెడ్డి, పెద్దిరాజు ఉన్నారు.

హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ ఏఆర్‌కు అటాచ్?

వనపర్తి క్రైం: ఓ కేసు విషయంలో జరిగిన పంచాయితీలో జోక్యం చేసుకున్నారని హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను వనపర్తి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మన్యపురెడ్డి, కానిస్టేబుల్ నవీన్‌గౌడ్ ఓ కేసు విషయంలో పెద్ద మనుషుల మధ్య జరిగిన పంచాయితీలో జోక్యం చేసుకున్నారని.. అందులో ఓ బాధితురాలు ఎస్పీ ఫిర్యాదు చేయడంతో వారిద్దరని వనపర్తి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె విధులపై నిర్లక్ష్యం వహించే వారికి మెమోలు జారీ చేస్తున్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

- ఏడు గదులకు రూ.4.65 కోట్ల ప్రతిపాదనలు
- మొదటి విడత 'మన ఊరు – మన బడిలో గుర్తించిన అధికారులు
- ఎప్పుడు కూలుతాయోనని ఆందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- నేటికి ముందుకు సాగని పనులు



పెచ్చులూడుతున్న తరగతి గదులు

అమరచింత: 'మన ఊరు –మన బడి' కార్యక్రమం ద్వార పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడు తరగతి గదులను తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాల కోసం అధికారులు రూ.4.65 కోట్లు ప్రతిపాదించారు. వీటిని కేటాయించాలని సంబంధిత నివేదికను జిల్లా విద్యాధికారితో పాటు ప్రభుత్వానికి నివేదించారు. పాఠశాల పునఃప్రారంభం సమయంలో వీటికోసం ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు, పాఠశాల మూతపడే సమయానికి సైతం పనులను ప్రారంభించలేకపోయారు. ప్రస్తుతం 'మన ఊరు – మన బడి' ద్వారా మొదటి విడతలో కేవలం రూ.30 లక్షల నుంచి రూ.60 లక్షల మధ్య ఖర్చుతో ఉన్న పాఠశాలల నిర్మాణాలను గుర్తించిన అధికారులు వీటిని మరుగున పడేశారు. దీంతో ఎప్పుడు పాఠశాల గదులు కూలుతాయా అనే సందేహాలతో విద్యార్థులు,



శిథిలావస్థలో ఆఫీస్ గది

ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ కాలాన్ని గడిపే పరిస్థితులు దాపురించాయి. అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లీష్, తెలుగు మీడియంలు కొనసాగుతున్నాయి. మొత్తంగా 524 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

శిథిలావస్థలో తరగతులు..

పాఠశాలలో మొత్తంలో ఏడు తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయి. కొన్ని సంవత్సరాలుగా తరగతి గదుల్లో పెచ్చులూడుతున్నాయని, విషయాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు, పాఠశాల ఉపాధ్యాయులు విన్నవించారు. 'మన ఊరు –మన బడి'లో వీటిని గుర్తించినా.. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన కనిపించడం లేదు. భారీ మొత్తంలో నిధులు అవసరం కావడంతో రెండో విడతలో వీటిని నిర్మించాలని భావించిన అధికారులు అంచనా విలువను నివేదించడంతోనే సరిపెట్టారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలకు 12 తరగతి గదులు, ఆఫీస్ రూంతో పాటు 13 గదులు ఉండాల్సిన అవసరం ఉంది. కాని ప్రస్తుతం 10వ తరగతి గదులు మాత్రమే ఉండటంతో వాటిలోనే విద్యాబుద్దులు, విద్యార్థులకు, ఉపాధ్యాయులు నేర్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే స్పందించి శిథిల తరగతి భవనాలను గుర్తించి నిధులను మంజూరు చేసి విద్యార్థులను ఆదుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..



పాఠశాలలో ఏడు తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయనే విషయాన్ని జిల్లా విద్యాధికారికి తెలియపరిచాం. 'మన ఊరు –మన బడి' ద్వార ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాఠశాల కోసం రూ.4.65 కోట్లు మంజూరు చేస్తూ.. ప్రణాళిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. వచ్చే విద్యాసంవత్సరంలో నిధులు మంజూరయ్యేలా ఎమ్మెల్యేకు పాఠశాల తరఫున నివేదించనున్నాం.

– బలరాముడు,
ప్రధానోపాధ్యాయుడు, అమరచింత

'సంత స్థలం వేణుగోపాలస్వామి గుడికే చెందాలి'



మాట్లాడుతున్న వేణుగోపాలస్వామి ఆలయ భూమి పరిరక్షణ సమితి సభ్యులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే సంత స్థలం వేణుగోపాలస్వామి గుడికే చెందాలని ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు ఆదివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ భూమి 30 ఎకరాల 19 గుంటలని గత కొన్ని సంవత్సరాలుగా సంత నిర్వహిస్తూ రూ.10 వేల నుంచి గ్రామపంచాయతీకి వేలంగా ఆదాయం ఇవ్వడంతో పాటు వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారన్నారు. దీంతో మున్సిపాలిటీకి ప్రతి ఏడాది రూ.3.40 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. అలాగే పట్టణ అభివృద్ధితో పాటు సంత స్థలానికి రూ.కోట్ల డిమాండ్‌రావడంతో కొందరు వ్యక్తులు పూజారులతో కలిసి ఆలయ భూమికి ఓఆర్‌సీ తీసుకొచ్చి సంత స్థలాన్ని కబ్జా చేస్తున్నారన్నారు. ఆలయ భూమి వేణుగోపాలస్వామికే చెందే వరకు పోరాడుతామన్నారు. పట్టణంలోని అన్ని కుల సంఘాలు, యువజన సంఘాలు, అఖిల పక్షం నాయకులు కలిసిరావాలని పిలుపునిచ్చారు. 21న వేణుగోపాలస్వామి ఆలయం నుంచి మున్సిపాలిటీ కార్యాలయం వరకు మౌనదీక్ష ర్యాలీ, 24న మున్సిపాలిటీ ఆవరణలో నిరసన కార్యక్రమం, 26న పట్టణ కేంద్రంలోని అన్ని వ్యాపార సంస్థలు బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయ భూమి పరిరక్షణ సమితి అధ్యక్షుడు బాలస్వామి, దయాకర్‌రెడ్డి, సహదేవుడు, చిట్టిబాబు, విజయవర్ధన్‌రెడ్డి, యల్లస్వామి, బస్వరాజుగౌడ్, శంకరయ్య, మోహన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి అందజేస్తున్న శాగాపూర్ గ్రామస్తులు

పాన్‌గల్: శాగాపూర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరుతూ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి క్యాంపు కార్యాలయంలో వినతి అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బయ్య యాదవ్ మాట్లాడారు. మండల కేంద్రం నుంచి వయా శాగాపూర్ మీదుగా కదిరెపాడు నుంచి సింగోటం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం, అర్హత కలిగిన వారికి గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరు, ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణం, ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలు వంటి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరినట్లు చెప్పారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. మండల కోఆప్షన్ సభ్యులు హలీమ్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులకు ద్రోహం చేస్తున్న కేంద్రం



మదనాపురంలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

మదనాపురం: వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులను కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేస్తుందని చలో ఢిల్లీ మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని కార్మికులు పిలుపునిచ్చారు. ఆదివారం మదనాపురం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన సదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ తొమ్మిది సంవత్సరాల్లో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలపై భారాలు మోపుతూ కార్పొరేట్ మతోన్మాద అనుకూల విధానాలను, రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని మండిపడ్డారు. ఈ విధానాలను ప్రజాస్వామ్య వాదులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు అయినటువంటి ఎల్ఐసీ, రైల్వే, తపాలా, విశాఖ ఉక్కు, బ్యాంకులను పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెడుతున్నారన్నారు. పేదల నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానంటాయని, పెట్రోల్, డీజిల్ ధరలు తొమ్మిదేళ్ల కింద రూ.55 నుంచి రూ.60 ఉండగా.. ప్రస్తుతం రూ.110కు చేరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, బీడీ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఏబుచ్చన్న కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాములు, చెన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, చీర్ల ప్రసాద్, సీఐటీయూ నాయకులు విష్ణు, నాగరాజు, గోపాల్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



పెబ్బేరు రూరల్: నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన చల్లా వెంకట్రామరెడ్డిని కర్నూల్ జిల్లా కేంద్రంలోని వారి నివాసంలో ఆదివారం పెబ్బేరు ఉమ్మడి మండలంలోని బీఆర్ఎస్ సర్పంచ్‌లు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కట్టా శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు సత్యయాదవ్, రవికుమార్ యాదవ్, రవీందర్ నాయుడు, చంద్రకళవిక్రమంగౌడ్, శ్రీరంగాపురం సింగిల్ విండో అధ్యక్షుడు, జగనాథం నాయుడు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిరంజన్‌రెడ్డికి సెర్ప్ ఉద్యోగుల కృతజ్ఞతలు

వనపర్తి: సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసిన సందర్భంగా ఆదివారం మంత్రి నిరంజన్‌రెడ్డిని హైదరాబాద్‌లో జిల్లా సెర్ప్ ఉద్యోగులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించటంలో కీలక పాత్ర పోషించారంటూ.. మంత్రికి శాలువా కప్పి సన్మానించారు. మంత్రి ఈ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రతిని సెర్ప్ ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో రేణుక, అరుణ, సెర్ప్ ఉద్యోగులు ఉన్నారు.

యాపర్లకు బస్సు నడపాలి



ఆర్టీసీ బస్సును ప్రారంభించాలని డిపో మేనేజర్‌కు వినతి అందజేస్తున్న గ్రామస్తులు

పెబ్బేరు: మండల పరిధిలోని యాపర్లకి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్తులు వనపర్తి ఆర్టీసీ ఆర్ఎంకు ఆదివారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా యాపర్ల, గుమ్మడం, గుమ్మడంతండా గ్రామాలకు గతంలో ఆర్టీసీ బస్సులు వస్తున్నాయి. ప్రస్తుతం బస్సులు రాకపోకలు లేకపోవడంతో పరీక్షలు రాసేందుకు విద్యార్థులు, పాఠశాలలకు వచ్చే ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పట్టణ కేంద్రానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బస్సును ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సీతారాంనాయక్, అరుణ్, శంకర్, కిరణ్, శివ, శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న మధు ముదిరాజ్

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాగితాల మధు రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. శ్రీకర ఫౌండేషన్ పాలమూరు వారు ఉత్తమ సేవలు అందించిన వారికి ఇస్తున్న ఈ పురస్కారానికి మధు ఎంపికయ్యారు. ఆదివారం శ్రీకర ఫౌండేషన్ వారు మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మెట్టుకాడి శ్రీను, పద్మ ఆయన్ను శాలువాతో సన్మానించి, ప్రశంసా పత్రంతో పాటుగా జ్ఞాపిక అందజేశారు.



పురస్కారం అందిస్తున్న శ్రీకర ఫౌండేషన్

పెబ్బేరు రూరల్: యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమయంలో రక్తదానం చేస్తూ, సోషల్ సర్వీస్, పేదలకు అన్నదానం సేవలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. దాని దృష్టిలో పెట్టుకొని శ్రీకర ఫౌండేషన్ పాలమూరు వారి ఆధ్వర్యంలో, శ్రీ రంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన యువశక్తి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ యాదవ్‌కు ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఉగాది పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మదనాపురం: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన వివిధ పంటల రైతులను ఆదుకోవాలని టీపీసీసీ మైనార్టీ కార్యదర్శి ఎం.డి అంజాద్ అలీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భారీ ఈదురు గాలులతో, ఉరుములతో, వడగండ్లతో కురిసిన వర్షానికి రైతులు పండిస్తున్న వివిధ రకాల ధాన్యం పంటలు, పండ్లు, కూరగాయలు తోటలకు నష్టం జరిగిందన్నారు. అలాంటి రైతులను అగ్రికల్చర్ హార్టికల్చర్ అధికారులు క్షేత్రస్థాయిలో పొలాల వద్దకు వెళ్లి నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

పేపర్ లీక్‌పై కాంగ్రెస్ నాయకుల నిరసన



అమరచింతలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజ్ గౌడ్

అమరచింత: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో బీఆర్ఎస్ మంత్రులే ప్రధాన సూత్రదారులని, అమాయక విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం కేటీఆర్ దిష్టిబొమ్మతో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం దహనం చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్, మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, గంగాధర్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: టీఎస్‌పీఎస్సీ పరీక్షల పేపర్ లీక్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. పేపర్ లీకేజీలతో యువత మనస్తాపానికి గురై సిరిసిల్లకు చెందిన నవీన్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నారన్నారు. నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని, పేపర్ లీకేకు కారకులైన వారిని కఠినంగా శిక్షిస్తూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కృష్ణ, జిల్లా మహిళా కార్యదర్శి సరోజమ్మ, స్వామి, ఇలియాస్, రంజిత్, రామస్వామి, వెంకటేష్, మైబూషి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని స్థానిక సుభాష్‌చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పేపర్ లీక్ వ్యవహారంలో ఐటీశాఖ, విద్యాశాఖ మంత్రులు వెంటనే రాజీనామా చేయాలని ఆదివారం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. సింగరేణి పరీక్ష, కానిస్టేబుల్ పరీక్షల్లో అవకతవకలు, గ్రూప్–1 పరీక్ష పత్రాలు టౌన్ ప్లానింగ్ పరీక్షల పత్రాలు లీకేజీలతో రాష్ట్ర యువతతో చెలగాటమాడుతుందని, ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేయాలని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి మొగిలి సత్యరెడ్డి, వెంకటేషసాగర్, సురేందర్‌గౌడ్, మన్నెం, రాములు యాదవ్, నేరందర్, రణధీర్‌రెడ్డి, నరసింహ నాయుడు, డైరెక్టర్ రాములు, చంద్రశేఖర్, వెంకటరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: టీఎస్‌పీఎస్సీలో జరిగిన పేపర్ లీక్‌ను సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ శంకర్‌నాయుడు కోరారు. ఆదివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎల్లస్వామి, రాముడు, గోవిందు, ఆశన్న, పురుషోత్తం, రామరాజు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీక్‌కు బాధ్యత వహిస్తూ.. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వెంటనే మంత్రి పదవికి నాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. పేపర్ల లీకేజీకి నిరసనగా రాష్ట్ర కమిటీ ఆదేశం మేరకు ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన రోడ్డుపై ధర్నా చేపట్టారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, రామకృష్ణారెడ్డి, విజయలక్ష్మి, కృష్ణయ్య యాదవ్, దేవన్న యాదవ్, దేవుజానాయక్, నరేందర్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నంబావి: మండల కేంద్రంలో ఆదివారం టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారాన్ని ఖండిస్తూ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్ రావు ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీలత రెడ్డి, పరమేష్, గోదల బీరయ్య యాదవ్, గంగయ్య యాదవ్, రాజేష్, ప్రతాప్‌రెడ్డి, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: నిరుద్యోగుల బాధను అర్థం చేసుకుని ప్రభుత్వం తరపున బాధ్యత వహిస్తూ.. వెంటనే కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేయాలని ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గోపాల్‌పేట, రేవల్లి మండల కేంద్రాల్లో దిష్టిబొమ్మలను దహనం చేశారు. నరహరి, శివన్న, వెంకటేష్, ప్రవీన్, లక్ష్మణ్, రమేష్, మధు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్– కొత్తపేట గ్రామాల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పీఆర్ రోడ్డుపై ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. రోడ్డుపై ఏర్పడిన గుంత దగ్గరికి వచ్చే వరకు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు చోటుచేసుకోక ముందే మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బీటీ రోడ్లకు మోక్షం



ఖిల్లాఘనపురం మండలం తిర్మలాయపల్లికి వేస్తున్న బీటీ రోడ్డు

ఖిల్లాఘనపురం: మండలంలో గ్రామీణ రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు 9 సంవత్సరాల నుంచి బీటీ రోడ్లకు రినివల్ కోటింగ్ వేయకపోవడంతో గుంతలు, కంకర తేలాయి. వర్షాకాలంలో వాహనదారులు నిబ్బందులకు గురయ్యారు. అవస్థలు పడుతూ గ్రామాల నుంచి మండల కేంద్రానికి చేరుకోవడం, తిరిగి వెళ్తుంటారు. స్పందించిన తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అధికారులు పనులు ప్రారంభించారు.


రూ.10.63 కోట్లు..

మండలంలోని 10 బీటీ రోడ్లకు బీటీ రినివల్ కోట్ వేసేందుకు ప్రభుత్వం రూ.10.63 కోట్లను ఎంఆర్‌ఆర్ నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో ఆగారం, కమాలొద్దీన్‌పూర్, వెంకటాంపల్లి, తిర్మలాయపల్లి, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, మామిడిమాడ, వెనికితండా, కుంటముందలి తండా, దొంతికుంట తండా, కర్నెతండాల రోడ్లకు బీటీ రినివల్ వేయడంతో పాటుగా కమాలొద్దీన్‌పూర్ నుంచి పోల్కంపల్లి వెళ్లే రోడ్డుకు ఉన్న మైనర్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడుతామని పంచాయతీరాజ్ శాఖ ఏఈ కబీర్‌దాస్ తెలియజేశారు.

ప్రారంభమైన పనులు...

మండలంలోని 10 గ్రామాల రోడ్లకు ప్రభుత్వం గ్రామీణ రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు చేయడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఇప్పటికే కమాలొద్దీన్‌పూర్ ఆగారం రోడ్డు పనులు పూర్తయ్యాయి. తిర్మలాయపల్లి రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నిరంతరంగా అన్ని గ్రామాలకు చెందిన పనులు పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు.

ఏప్రిల్ చివరి నాటికి పనులు పూర్తి



మండలంలో దెబ్బతిన్న 10 బీటీ రోడ్లకు రినివల్ కోట్ వేసేందుకు గాను ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే పనులు పూర్తి చేశాం. ఏప్రిల్ చివరి నాటికి అన్ని రోడ్లకు రినివల్ పనులు పూర్తి చేస్తాం. బ్రిడ్జి, సీసీలు త్వరలో చేస్తాం.

– కబీర్‌దాస్,
ఏఈ పంచాయతీరాజ్ శాఖ, ఖిల్లాఘనపురం



ఖిల్లాఘనపురం మండలం ఆగారం బీటీ రోడ్డు